సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం : 18 : మార్చి : 2025



సహాయక చర్యలు ముమ్మరం

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కార్మికుల జాడ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-29 (మంగళవారం సాయంత్రం)

సహర్ 5-11 (బుధవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.3 /16.1

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



గద్వాల క్రైం: **వేసవి కాలంలో ప్రజలందరు స్వీయ జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని** జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి సిద్దప్ప అన్నారు. సోమవారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. గత వారం రోజుల నుంచి జిల్లాలో ఎండ తీవ్రత దాటికి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరు సరిపడా నీటిని తాగాలన్నారు. ఆహార అలవాట్లు, రోజు వారి శ్రమ తదితర విషయాలను సూర్యర్శ్మి తీవ్రత ఉన్న సమయంలో ఉపశమనం తీసుకోవాలన్నారు. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల శిక్షణకు ఎంపిక



బీచుపల్లి

గద్వాలటౌన్: ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జమ్ము కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ పోటీల శిక్షణ క్యాంపునకు గద్వాలకు చెందిన క్రీడాకారుడు బీచుపల్లి ఎంపికయ్యారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ తెలిపారు. గత నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు వికారాబాద్‌లో జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ బాలుర కబడ్డీ పోటీలలో జిల్లా జట్టు తరపున బీచుపల్లి పాల్గొని ప్రతిభ కనబర్చారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో బీచుపల్లి క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి సెలక్టర్లు జాతీయ స్థాయి పోటీల శిక్షణా శిబిరానికి ఎంపిక చేశారని తెలిపారు. వారం రోజుల పాటు జరిగే శిక్షణలో పాల్గొననున్నారు. ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ అబ్రహం, సెక్రటరి రవి, కోశాధికారి చందు, కరెంటు నర్సింహా, నగేష్, రైల్వేపాష, వెంకటన్న సీనియర్ క్రీడాకారులు హర్షం తెలిపారు.

ముగిసిన వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు



బిజినేపల్లి: మండలంలోని వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన ఎదుర్కోళ్లు, స్వామివారి కల్యాణం, చతుర్‌స్రార్చన వంటి కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు చతుర్‌స్రార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రాతారాధన, సేవాకాలం, రాజభోగం, పూర్ణాహుతి, నవ కలశ స్నపన చక్రతీర్థం అత్యంత శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల శ్రీమన్నారాయణ, అర్చకులు శ్రీకర్, శేషసాయి, రంగనాథ్, ప్రసాద్, నర్సింహచార్యులు, నవీన్, తివారీ స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. వారం రోజులపాటు సాగిన బ్రహ్మోత్సవాలను తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్రంగడ్డ పనుల్లో కదలిక

నూతన ఏజెన్సీకి వంతెన నిర్మాణ పనులు



గుర్రంగడ్డ వంతెన నిర్మాణ పనులు

- కృష్ణానదిలో ఏకైక దీవి గ్రామం..
- అత్యవసర పరిస్థితుల్లో నది దాటేందుకు తీవ్ర ఇబ్బందులు
- వంతెన నిర్మాణంతో తీరనున్న కష్టాలు

గద్వాల: ఏడాదిలో ఆర్నెళ్లు దీవిలో.. మరో ఆర్నెళ్లు మైదాన ప్రాంతంలో జీవిస్తున్నారు గుర్రంగడ్డవాసులు. విద్య, నిత్యావసర వస్తువులు, అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలు పొందాలన్నా పుట్టీల సాయంతో నది దాటాల్సిందే. కృష్ణానదిలో ఏకైక దీవి గ్రామం ఇదే. వంతెన నిర్మించి తమ కష్టాలు తీర్చాలని ఏళ్లుగా గుర్రంగడ్డ వాసులు కోరుతున్నా.. బ్రిడ్జి నిర్మాణం మాత్రం పూర్తవడంలేదు. తాజాగా వంతెన నిర్మాణ పనులను కొత్త ఏజెన్సీకి అప్పగించామని, పనులు వేగవంతం చేసి కష్టాలు తొలగిస్తామని అధికారులు పేర్కొంటుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్నెళ్లు నది మధ్యలోనే..

వానాకాలం సీజన్‌లో భారీగా కురిసే వర్షాలకు వరద వచ్చి చేరడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంటుంది. ఈ సమయంలో గుర్రంగడ్డ వాసులు పుట్టీలు, పడవల ద్వారా ప్రయాణించాల్సిందే. ఈక్రమంలో వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నది మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. ఈగ్రామంలో మొత్తం 600 కుటుంబాలు నివాసం ఉంటుండగా 450 మంది వరకు ఓటర్లున్నారు. మొత్తం వ్యవసాయ భూమి విస్తీర్ణం 2100 ఎకరాలు కాగా ఇందులో సుమారు 1600 ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలు సాగుచేస్తారు. ఇందులో ప్రధాన పంట వరి. ఇలాంటి పరిస్థితిలో నదిలో భారీగా వరద ప్రవహిస్తున్నప్పుడు బాహ్యాప్రపంచంతో దీవివాసులకు పూర్తిగా సంబంధాలు కోల్పోతాయి. ఏడాదిలో ఆర్నెళ్ల వరకు ఈ కష్టాలు వెంటాడుతుంటాయి.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో..

గత ప్రభుత్వం 2018లో రూ.12కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పనులు మొదలుపెట్టింది. అయితే పనుల దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వచ్చాడు. దీనిపై అధికారులు పలుమార్లు నోటీసులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కాంట్రాక్టర్‌లో మాత్రం చలనం లేదు. దీంతో గత ఏడేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తాజాగా సదరు కాంట్రాక్టర్‌పై అధికారులు వేటు వేశారు. 60సీ నోటీసులు జారీ చేసి పాత కాంట్రాక్టర్, కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీని తొలగించి నూతనంగా మరో ఏజెన్సీకి పనులు అప్పగించారు. దీంతో పనులు దక్కించుకున్న ఏజెన్సీ పనులు మొదలుపెట్టింది. ప్రస్తుతం పనులు వేగవంతం సాగుతున్నాయి. వేసవి కాలంలో పనులు వేగవంతం చేసి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని.. తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని గుర్రంగడ్డ వాసులు కోరుతున్నారు.

ఏడాదిలో పూర్తి చేస్తాం

2018లో రూ.12కోట్లతో గుర్రంగడ్డ వంతెన నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయలేదు. దీంతో పాత ఏజెన్సీకి 60సీ నోటీసులు ఇచ్చి తొలగించాం. కొత్త ఏజెన్సీకి వంతెన నిర్మాణ పనులు అప్పగించాం. వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

– రహీముద్దీన్, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ

రూ.12 కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో కృష్ణానది మధ్యలో ఉన్న ఏకైక దీవి గ్రామం గుర్రంగడ్డ. ఈ గ్రామ ప్రజల రాకపోకలకు ఏకైక మార్గం నదిలో పుట్టీల ద్వారా ప్రయాణం చేయడం. దీవిగ్రామ ప్రజల కష్టాలు తీర్చాలని గత ప్రభుత్వం హయాంలో 2015లో రూ.12కోట్ల అంచనాలతో వంతెన నిర్మాణ పనులను చేపట్టారు. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు మొదలు పెట్టకపోవడంతో గత ఏడేళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పనులు ముందుకు సాగలేదు. తాజాగా అధికారులు పాత ఏజెన్సీని మార్చేసి కొత్త ఏజెన్సీకి పనులు అప్పచెప్పడంతో పనుల్లో కదలిక మొదలైంది. వచ్చే ఏడాది వరకు పనులు పూర్తి చేసి రాకపోకలు ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు సమస్యలపై 30మంది ఫిర్యాదులు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపినట్లు వాటిని వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత ఫిర్యాదుదారుడికి అక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 10 అర్జీలు..

గద్వాల క్రైం: పోలీస్ గ్రీవెన్స్ కార్యక్రమానికి 10 ఫిర్యాదులు అందాయని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గద్వాల- అలంపూర్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు తమ సమస్యలపై వివరించారని, ఇందుల్లో భూ సంబంధ, సైబర్ మోసాలు, వేధింపులపై ఫిర్యాదులు అందాయన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ బాధితులకు వివరించారు.

ప్రతి కొనుగోలుకు రశీదు తప్పనిసరి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్‌తేజ

అలంపూర్: వినియోగదారులు ప్రతి కొనుగోలుకు రశీదు తీసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్‌తేజ అన్నారు. అలంపూర్‌లోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారులు కొనుగోలుకు సంబంధించి రశీదు పొందడం వలన ఏవైనా సమస్యలు వచ్చినా, ఇబ్బందులు కలిగిన రశీదు ఆధారంగా న్యాయం పొందవచ్చని అన్నారు. సమావేశంలో అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్, న్యాయవాదులు శ్రీనివాసులు, నాగరాజు యాదవ్, వెంకటేష్, యాకోబు, నాగయ్య, తిరుమలేష్, కక్షిదారులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయించండి



ఇథనాల్ కంపెనీని రద్దు చేయించాలని కోరుతున్న పెద్ద ధన్వాడ ప్రజలు

శాంతినగర్: ఇథనాల్ కంపెనీ ఏర్పాటుచేస్తే రైతులు పంటలు నష్టపోతారని, ప్రజలు అనారోగ్యాల బారిన పడతారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు పెద్ద ధన్వాడ ప్రజలు విన్నవించారు. ప్రజలకు, రైతులకు నష్టం వాటిల్లే ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దుచేయించాలని ఆయనను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వంతో మాట్లాడతానని వారికి హామీ ఇచ్చారు. ఇదిలాఉండగా, వడ్డేపల్లి మండలం కొంకలకి చెందిన ఎం.శారదమ్మ అనారోగ్యానికి గురికాగా ఆమె ఆపరేషన్ ఖర్చుల కొరకు రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ కాపీని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు.

ఆర్డీఎస్‌కు నీరందించండి..

ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని విడుదల చేయించాలని ఆయకట్టు రైతులు ఆయనను కోరారు. వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సోమవారం శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో కలిసి నీటిని విడుదల చేయించాలని కోరారు. స్పందించిన ఏఐసీసీ కార్యదర్శి నీటిని విడుదల చేయించేందుకు తన వంతు కృషిచేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

భూ బాగోతంపై విచారణకు ఆదేశం



గట్టు తహసీల్దార్ కార్యాలయం

సాక్షి ఎఫెక్ట్..

గట్టు: గుట్టుగా ఐదెకరాల భూమిని స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యవహారంపై సోమవారం జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. గట్టు మండలంలోని ఇందువాసి శివారులో ఐదెకరాల భూమిని అడ్డదారుల్లో వారసులు కాని వారసులు రికార్డులను మార్చుకొని సొంతం చేసుకునేందుకు యత్నించగా.. దీనిపై 'ఐదెకరాల భూమికి టెండర్' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమవగా అధికారులు స్పందించారు. అసలు గట్టు రెవెన్యూ కార్యాలయంలో ఏం జరుగుతుందని, అక్రమాలకు ఎవరెవరు సహకరిస్తున్నారనే విషయాలను తెలుసుకునేందుకు విచారణకు ఆదేశించినట్లు సమాచారం. తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఎవరు జారీ చేశారు, జారీ చేసే క్రమంలో కనీస విచారణ చేశారా లేదా అనే అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. జీవించి ఉన్న తల్లిదండ్రులను చనిపోయినట్లుగా నమ్మించిన వ్యక్తికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను రెవెన్యూ అధికారులు గుడ్డిగా ఎలా జారీ చేస్తారని, ఎవరి హయాంలో ఈ సర్టిఫికెట్‌ను జారీ చేశారనే వివరాలపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఇదిలాఉండగా అసలు పట్టాదారుడైన ముత్తయ్య చాలా కాలం క్రితమే చనిపోయినప్పటికీ అతను 2019లో చనిపోయినట్లుగా చూపుతున్న మరణ ధ్రువీకరణ పత్రం కూడా నకిలీది అని తెలిసింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి, మరణ ధ్రువీకరణ పత్రాన్ని పొందినట్లుగా తెలుస్తోంది. 2019లో ఇందువాసి కార్యదర్శిగా పని చేసిన వ్యక్తిని మరణ ధ్రువీకరణ పత్రం గురించి ప్రశ్నిస్తే.. అసలు ఆ సంతకం తనది కాదని, తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు వ్యక్తి తెలపడం గమనార్హం. మొత్తం మీద గట్టు భూ బాగోతం వ్యవహారంపై అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారనే దానిపై మండల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయులు

గద్వాల: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా టి.రామాంజనేయులును నియమిస్తూ పార్టీ రాష్ట్ర ఎన్నికల కో–రిటర్నింగ్ అధికారి గీతామూర్తి సోమవారం ప్రకటన విడుదల చేశారు. అలాగే, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గద్వాల నియోజకవర్గం నుంచి ఆ పార్టీ సీనియర్ నాయకులు బండల వెంకట్రాములు, అక్కల రమాసాయిబాబ, అలంపూర్ నియోజకవర్గం నుంచి కె.జయలక్ష్మిని నియమించారు.

అలివేలు మంగ హుండీ లెక్కింపు



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ అలివేలు మంగతాయారు హుండీ లెక్కింపు సోమవారం చేపట్టారు. ఈ ఏడాది అమ్మవారికి హుండీ ద్వారా రూ.9,73,440 ఆదాయం వచ్చింది. లెక్కింపులో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు సుధా, అలివేలు మంగమ్మ, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో వసతులు కల్పించాలి



మెడికల్ కళాశాల పరిశీలన అనంతరం మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం బీజేపీ నాయకులు ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులు, విద్యార్థులతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆర్భాటంగా ప్రారంభించడంతో చూపిన శ్రద్ధ, విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో చూపలేదని విమర్శించారు. సమస్యలతో విద్యార్థులు సహజీవనం చేస్తున్నారని మండిపడ్డారు. 300 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనంలోనే మెడికల్ కళాశాలను నిర్వహించడం దారుణమన్నారు. మెడికల్ కళాశాల భవనం ఇంకా నిర్మాణంలోనే ఉందని చెప్పారు. విద్యార్థులకు వసతి సౌకర్యం లేదని, కళాశాలకు ప్రహరీ నిర్మించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తులకు కాకుండా ఫుడ్ సప్లైయ్‌కు టెండర్ నిర్వహించాలని కోరారు. తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మెడికల్ కళాశాలకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవికుమార్, రామాంజనేయులు, మురళీధర్‌రెడ్డి, కేకే రెడ్డి, బండల వెంకట్రాములు, రాజగోపాల్ పాల్గొన్నారు.

దళారుల జోరు

మొక్కజొన్న పంట కోతలకు సిద్ధమవుతున్న రైతులు

- ఇదే అదునుగా పొలాల వద్ద వ్యాపారుల పాగా
- గతేడాది ధరతోనే కొనుగోలు చేస్తామంటున్న వ్యాపారులు
- గిట్టుబాటు ధర లేక రైతుల గగ్గోలు



పెద్ద తాండ్రపాడు శివారులో మొక్కజొన్న పంట కోస్తున్న రైతు

రాజోళి: మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులే లక్ష్యంగా మాయమాటలు చెప్పి వారి నుంచి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసేందుకు దళారులు సిద్ధమయ్యారు. ఉదయం నుండే గ్రామాల్లో తిరుగుతూ రైతుల నుంచి పంటను బేరం కుదుర్చుకుని, అవసరమైతే అడ్వాన్స్‌లు చేతిలో పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. మరోవైపు.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం, పాత ధరకే మొక్కజొన్నను అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు దిగాలు చెందుతున్నారు. పంటను పండించి, విక్రయించేందుకు మార్కెట్.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేక నష్టానికే అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలకోర్చి పంటల సాగు..

మొక్కజొన్న పంట వేసినప్పటి నుండి ఆర్డీఎస్‌కు సరైన నీరు రాకపోవడం, వేసిన పంటకు తడులు అందుతాయా లేదా అనే ఆందోళనలోనే రైతులు గడిపారు. పంట వేసిన ఆరంభం నుండే ఆందోళనల నడుమ.. అష్ట కష్టాలు పడి చివరి వరకు పంటను తీసుకువచ్చారు. కానీ ఇప్పటివరకు పడ్డ కష్టం ఒక ఎత్తయితే.. ప్రస్తుతం పంటను విక్రయించడం పెద్ద కష్టంగా మారిందని రైతులు అంటున్నారు. ఎగువ నుంచి సరైన నీరు రాకపోవడంతో పక్క పొలాల నుంచి బోర్ల ద్వారా నీరు తీసుకుని పంటకు తడులు అందించామని, తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా వచ్చిన నీటితో రాత్రి పగలు తేడా లేకుండా నిద్ర మానుకుని తడులు అందించామని, ఇంతా చేస్తే చివరికి అనుకున్న ధర లేకపోవడంతో మా కష్టానికి తగినంత ఫలితం అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట ఎదుగుదల కోసం గులికలు, మందులు అని రూ.వేలల్లో పెట్టుబడి పెడితే పెట్టిన పెట్టుబడైనా వచ్చేలా లేదని భయం రైతులను వెంటాడుతోంది.

రెండేళ్లుగా వ్యాపారులకే..

మొక్కజొన్న పంట కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో గతేడాది రైతులు.. వ్యాపారులకే పంట విక్రయించారు. ఈ ఏడాది సైతం గతేడాది ధరనే ఇస్తామని చెప్పడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ధర పెరుగుతుందా, పంట విక్రయించాక ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తుందా అన్న అనుమానాలు రైతులను వెంటాడుతున్నారు. ఒకవేళ ఇప్పుడు విక్రయించకపోతే పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతాయని ఆవేదన చెందుతున్నారు. గతేడాది క్వింటాకు రూ.2,200 నుంచి రూ.2,500 వరకు మించి అమ్ముకోలేదని, ఇప్పుడు కూడా అదే ధర ఇస్తున్నారని, కనీసం రూ.3 వేలు అయినా వస్తే తమ కష్టానికి ఫలితం ఉంటుందని రైతులు అంటున్నారు. ఇప్పుడు కోతలు జోరు పెరగడంతో దళారులు, వ్యాపారులు కూడా వారి జోరు పెంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారని, ప్రభుత్వం కేంద్రం ప్రారంభించి సరైన ధర కల్పించాలని కోరుతున్నారు.



రాజోళి శివారులో కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట

పాత ధరతోనే అమ్మకాలు



గత ఏడాది ధరనే.. ఇప్పుడూ ఉంది. కనీసం మొక్కజొన్న క్వింటాకు రూ.3 వేలు ఉంటే రైతు కష్టానికి ఫలితం దక్కుతుంది. ఇప్పటికే వ్యాపారులు పంట కొనేందుకు బేరాలు మొదలుపెట్టారు. అప్పులు చేసిన రైతులు వ్యాపారులకే అమ్ముకుంటారు. ఈ సమయానికే ప్రభుత్వం నుంచి కొనుగోలు కేంద్రం ప్రారంభమై ఉంటే రైతులు కోసిన పంటను నేరుగా కేంద్రాలకు తెచ్చుకుని విక్రయించేవారు. – విష్ణు, రైతు, తుమ్మలపల్లె

కోతలు సాగుతున్నాయి



ప్రస్తుతం కోత కోసేందుకు సిద్ధం ఉన్నాం. మరికొన్ని చోట్ల పంటను కోస్తున్నారు. వారంతా వ్యాపారులకు అమ్ముకునేందుకు సిద్ధమయ్యారు. ఎందుకంటే పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతాయి. ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేస్తే బాగుంటుంది. – నర్సింహాలుగౌడ్, పచ్చర్ల

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


అనూష (ఫైల్)

పెద్దకొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన దేవల తిరుమలాపూర్‌లో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. వివరాలు.. పెద్దకార్పాముల గ్రామానికి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్ మెరుగు రాజు, అతడి భార్య అనూష, కొడుకుతో కలిసి ఆదివారం బైక్‌పై వనపర్తికి వెళ్తున్నాడు. దేవల తిరుమలాపూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయాడు. బైక్ అదుపు తప్పి అనూష రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించింది. రాజుకు, అతడి కుమారుడికి గాయాలయ్యాయి. సోమవారం మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, జూపల్లి అరుణ్ కుమార్‌రావు పరామర్శించారు.

చెరువులో పడి మహిళ..

తెలకపల్లి: చెరువులో పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. వివరాలు.. తెలకపల్లికి చెందిన రెడ్డపాకుల చంద్రమ్మ (35) అనే మహిళ కొంత కాలంగా మద్యానికి బానిసైంది. కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినిపించుకోలేదు, తన ప్రవర్తన మార్చుకోకుండా ఎప్పుడు చనిపోతానని అంటూ ఉండేదని తెలిపారు. ఈనెల 16న గ్రామ శివారులో ఉన్న పెద్దచెరువు దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడింది. ఈత రాకపోవడంతో మృతిచెందింది. మృతురాలి భర్త రెడ్డపాకుల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

జడ్చర్ల: తాగునీళ్లు అనుకొని ఫినాయిల్ తాగి వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ఉదండాపూర్‌కి చెందిన గద్ద పెంటయ్య (62) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో బాత్‌రూంకు వెళ్లి అక్కడ తాగునీళ్లు అనుకొని బాటిల్‌లో ఉన్న ఫినాయిల్ తాగాడు. అపస్మారక స్థితికి చేరుకోగా గమనించిన కుటుంబీకులు హుటాహుటిన జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ మండలం గుడిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. గుడిపల్లికి చెందిన బాలస్వామి (36) హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య వనిత తన సోదరి భర్త శివతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటంతో ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన బాలస్వామి.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శతాధిక వృద్ధుడు గుజ్జుల ఆశన్న మృతి


ఆశన్న (ఫైల్)

మదనాపురం: మండలంలోని నరసింగాపురం గ్రామానికి చెందిన గుజ్జుల పెద్ద ఆశన్న(103) సోమవారం మృతిచెందారు. మొదటి పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికై మూడు పర్యాయాలు కొనసాగారు, ఐదు సార్లు గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవం కావడానికి కీలక పాత్ర పోషించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయన కుటుంబానికి మాజీ సర్పంచ్ భాగమ్మ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సహాయక చర్యలు ముమ్మరం

24 రోజులు గడిచినా లభించని కార్మికుల ఆచూకీ

- నిర్విరామంగా శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు
- ఎస్ఎల్‌బీసీలో అందుబాటులోకి రాని రోబో సేవలు


లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్తున్న కాడవర్ డాగ్స్, సిబ్బంది

అచ్చంపేట/ అచ్చంపేట రూరల్: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న కార్మికుల జాడ సోమవారం కూడా దొరకలేదు. టన్నెల్‌లో గల్లంతైన వారి ఆచూకీ కోసం గత 24 రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుంది. గల్లంతైన ఎనిమిది మందిలో టీబీఎం ఆపరేటర్ మృతదేహం లభించగా.. మిగతా ఏడుగురు కార్మికుల జాడ కోసం సహాయక బృందాలు నిర్విరామంగా శ్రమిస్తున్నాయి. జీపీఆర్, కాడవర్ డాగ్స్ గుర్తించిన ప్రదేశాల్లో సింగరేణి కార్మికులు షిఫ్టుల వారీగా సొరంగంలోకి వెళ్లి తవ్వకాలు జరుపుతున్నారు. డీ2 ప్రదేశంలో తవ్వకాలు చేపట్టినా కార్మికుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో డీ1 ప్రదేశంలో ప్రధానంగా రెండు రోజుల నుంచి తవ్వకాలు అతికష్టంగా సహాయక బృందాలు చేపడుతున్నాయి. టీబీఎం విడి భాగాలను తొలగిస్తున్నా పురోగతి లేకపోతోంది. ఈ క్రమంలోనే సోమవారం మరోసారి కాడవర్ డాగ్స్‌ను సొరంగంలోని డీ-1, డీ-2 ప్రదేశాల్లో గాలింపు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు సొరంగంలోని డీ1, డీ2 ప్రదేశాల్లో టీబీఎం పరికరాలు మట్టిలో కూరుకుపోవడంతో పైనుంచి ఉబికి వస్తున్న ఊట నీటితో పనులకు ఆటంకం కలుగుతోంది. టీబీఎం ముందు భాగంలోని చివరి 40 మీటర్ల వద్ద మట్టి, రాళ్లు, టీబీఎం శకలాలను కదలిస్తే మరో ప్రమాదం జరిగే అవకాశం ఉందని సిబ్బంది అనుమానిస్తున్నారు. ఈ దశలో సహాయక చర్యలు సిబ్బందికి సవాల్‌గా మారాయి. ఇదిలా ఉండగా.. సహాయక చర్యలు వేగవంతం చేసేందుకు ఆరు రోజుల క్రితం ఇక్కడికి వచ్చిన రోబోల సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు. అటానమస్ పవర్డ్ హైడ్రాలిక్ రోబో అనుసంధానంగా ఏర్పాటు చేసిన వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంకులు పనిచేయడంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో టెక్నీషియన్లు ప్రయత్నాలు చేస్తున్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ రఘునాథ్

ఉన్నతాధికారుల సమీక్ష..

టన్నెల్ డీ-1, డీ-2 ప్రదేశాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా చేపడుతున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం ఉదయం టన్నెల్ వద్ద పరిస్థితులపై కలెక్టర్ ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్‌తో కలిసి సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగుతున్నామని చెప్పారు. టన్నెల్ బోరింగ్ మిషన్ విడి భాగాలను తొలగించే పనులు కొనసాగిస్తూ ఎస్కవేటర్ వద్ద మట్టి తొలగించే పనులు వేగవంతం చేసినట్లు వివరించారు. డీవాటరింగ్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, బృందాలకు అవసరమైన సామగ్రి, సిబ్బంది భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేశామన్నారు.

మొరాయిస్తున్న కన్వేయర్ బెల్టు

సొరంగంలో సహాయక బృందాలు చేపడుతున్న గాలింపు చర్యలకు ఊట నీరు ఆటంకం కలిగిస్తోంది. 13.5 కి.మీ., తర్వాత ఏర్పాటు చేసిన డీ-2 ప్రాంతంలో ఒక కాల్వలో నీళ్లు పెరుగుతున్నాయి. నీటిని డీవాటరింగ్ చేసేందుకు ప్రతి 2.5 కిలోమీటర్లకు ఒక పంపింగ్ మోటారు ఏర్పాటు చేసి నీటిని బయటికి పంపించే చర్యలు తీసుకుంటున్న నీటి ఊట తగ్గడం లేదు. సొరంగంలోని బురద, మట్టిని బయటకు పంపడానికి ప్రధానంగా కన్వేయర్ బెల్టు కీలకం. కానీ, ఈ కన్వేయర్ బెల్టు తరుచుగా మొరాయిస్తుండటం.. దాని స్థాయికి తగ్గట్టు పనిచేయకపోవడంతో సహాయ చర్యలకు విఘాతం కలుగుతున్నాయి. డీ-1 పాయింట్ వద్ద గత రెండు రోజుల నుంచి సహాయక చర్యలను ముమ్మరం చేశారు. టీబీఎం వద్ద దక్షిణమధ్య రైల్వేకు చెందిన రెస్క్యూ బృందాలు శకలాలను కట్ చేస్తూ విడి భాగాలను బయటకి పంపిస్తున్నారు. అత్యంత ప్రమాదంగా గుర్తించిన డీ1 వద్ద ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రోబో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో కార్మికుల జాడ లభించేందుకు మరింత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

టైర్ పగిలి ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు ..

తాత, మనవడు దుర్మరణం

- కూతురి పరిస్థితి విషమం
- జడ్చర్ల మండలం మాచారం వద్ద దుర్ఘటన
- జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్


నిదయ్‌రెడ్డి(ఫైల్)


ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన కారు

జడ్చర్ల: ఆకస్మాత్తుగా టైర్ పగిలిపోవడంతో అదుపుతప్పిన కారు రోడ్డు డివైడర్‌ను దాటి అవతలి వైపు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఈ ప్రమాదంలో తాతమనవడు దుర్మరణం చెందారు. కూతురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన ఎం.వెంకట్‌రెడ్డి (76) మహబూబ్‌నగర్‌లోని ప్రేమ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వెంకట్‌రెడ్డి కూతురు హైదరాబాద్‌లోని నార్సింగిలో నివాసం ఉంటున్నారు. సోమవారం వెంకట్‌రెడ్డి కూతురు శ్వేత(45), ఆమె కుమారుడు నిదయ్‌రెడ్డి (22)తో కలిసి హైదరాబాద్ నుంచి కారులో జడ్చర్ల వైపు వస్తున్నారు. మాచారం గ్రామం దాటాక జాతీయరహదారిపై ఆకస్మాత్తుగా కారు టైరు పగిలిపోయింది. దీంతో అదుపుతప్పిన కారు డివైడర్‌ను దాటుకుంటూ అవతలి వైపునకు దూసుకెళ్లింది. అదే సమయంలో జడ్చర్ల నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కారు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న శ్వేత, పక్క ఉన్న వెంకట్‌రెడ్డి తీవ్రగాయాలకు గురయ్యారు. నిదయ్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. క్షతగాత్రులను వైద్యచికిత్స కోసం 108 అంబులెన్స్‌లో ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. కొనఊపిరితో ఉన్న వెంకట్‌రెడ్డి మార్గమధ్యలోనే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రగాయాలకు గురైన శ్వేతను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాద సమయంలో కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో డ్రైవర్ సీట్లో ఉన్న శ్వేతకు ప్రాణాపాయం తప్పింది. ప్రమాదంలో దుర్మరణం చెందిన వెంకట్‌రెడ్డి సర్వేయర్‌గా పదవీ విరమణ పొందగా నిదయ్‌రెడ్డి బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. శ్వేత సొంత గ్రామం నల్గొండ జిల్లా చండూరు కాగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆమెకు భర్త శేఖర్‌రెడ్డి, ఇద్దరు కుమారులు ఉండగా మృత్యువాత పడిన నిదయ్‌రెడ్డి చిన్నవాడు. ప్రమాద సంఘటనతో ఆకుటుంబం ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగిపోయింది. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు పూర్తిగా ధ్వంసం..

రోడ్డు ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం అయ్యింది. కారు ఢీకొట్టడంతో ఆర్టీసీ బస్సు కూడా ముందు ఒక భాగం ధ్వంసమైంది. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించారు.

క్యాతూర్‌లో పేలిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఇళ్లలో కాలిపోయిన టీవీ, ఫ్రిజ్‌లు, కరెంట్ మీటర్లు


షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇంట్లో కాలిపోయిన విద్యుత్ మీటర్

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ గ్రామంలో 25 కేవీ మూడు నూతన ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 25 కేవీ 3 ట్రాన్స్‌ఫార్మర్లు అకస్మాత్తుగా పేలిపోయి మంటల వ్యాపించాయి. ఈ ప్రమాదంలో విద్యుత్ తీగలపై మంటలు వ్యాపించి.. పలు ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, కరెంట్ మీటర్లు, సెల్‌ఫోన్ చార్జర్లు కాలిపోయాయి. దీంతో భారీగా శబ్దాలు రావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. విద్యుత్ తీగలపై పెద్దఎత్తున మంటలు వ్యాపించి.. గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు 50 ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు ఇతరత్రా పరికరాలు కాలిపోయి రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని గ్రామస్తులు వాపోయారు.

సమస్య పరిష్కరించిన అధికారులు

షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిన విషయం తెలుసుకున్న వెంటనే విద్యుత్ సిబ్బంది గ్రామానికి చేరుకుని సమస్యను పరిష్కరించి.. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఏఈ అఖిల్ తెలిపారు. గ్రామంలో లోఓల్టేజీ సమస్య ఉండడంతో సోమవారం 6 గంటల సమయంలో మరమ్మతు చేసిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన కొద్ది సేపటికే ఇంటర్‌నల్ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయని చెప్పారు. వాటి స్థానంలో 15 కేవీ సామర్థ్యం గల మరో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే పేలిపోయిన మీటర్ల స్థానంలో తమ శాఖ తరపున నూతన మీటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదన్నారు.

జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరాలయం


నదిలో నుంచి బయటపడిన ఆలయ ప్రాంగణం


సంగమేశ్వరస్వామి ప్రధాన ఆలయం

కొల్లాపూర్: సప్తనదీ సంగమ ప్రాంతంలోని సంగమేశ్వరాలయం జలాధివాసం వీడుతోంది. క్రమేణ కృష్ణానదిలో నీటిమట్టం తగ్గుతుండటంతో ఆలయం బయటపడుతోంది. సోమవారం ఆలయ ప్రాకారం పూర్తిస్థాయిలో తేలింది. ఆలయ ప్రాంగణంలో నడుము లోతు వరకు మాత్రమే నీళ్లు ఉన్నాయి. ఆలయ అర్చకులు రఘురామశర్మ గర్భగుడిలోకి వెళ్లి సంగమేశ్వరుడికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. వారం రోజుల వ్యవధిలో నాలుగు అడుగుల మేరకు ఆలయ ప్రాంగణంలో నీటిమట్టం తగ్గింది. నీటి తగ్గింపు ఇలాగే కొనసాగితే.. ఈ నెలాఖరులోగా ఆలయం పూర్తిగా నీటి నుంచి బయటపడే అవకాశం ఉంది. ప్రస్తుతం శ్రీశైలం బ్యాక్‌వాటర్ లెవెల్స్ 842 అడుగులు ఉన్నాయి.

రూ.లక్ష విలువ చేసే గుట్కాలు సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: పోలీసుల తనిఖీల్లో ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను అక్రమంగా తరలిస్తున్న ఓ జీపును అదుపులోకి తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సోమవారం చేసిన వాహనాల తనిఖీల్లో ఏపీ 21 టీవీ6092 నంబర్ కలిగిన జీపులో పాన్ మాసాలాలు, గుట్కాలు తరలిస్తుంటే పట్టుకున్నట్లు తెలిపారు. జీపు డ్రైవర్ మహేష్‌గౌడ్‌ను విచారణ చేయగా గుట్కాలు పట్టణంలోని షాషాబ్‌గుట్టకు చెందిన శ్రావణ్‌కుమార్ అనే వ్యక్తికి సంబంధించినవిగా నిర్ధారణ అయింది. దీంతో రూ.లక్ష విలువ చేసే గుట్కాలతో పాటు జీపును సీజ్ చేసి ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వేధింపులు తాళలేకనే నవవధువు ఆత్మహత్య

జడ్చర్ల: మండలంలోని రాళ్లగడ్డ తండాలో నవవధువు ఆత్మహత్య ఘటనపై పోలీసు కేసు నమోదైంది. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుదిమల్ల గ్రామానికి చెందిన సూర్యపాక చర్శిత (22) బీఫార్మసీ చదువుతున్న సమయంలో అదే కళాశాలలో చదువుతున్న రాళ్లగడ్డ తండాకు చెందిన అంగోతు పవన్‌తో ప్రేమలో పడింది. గత జనవరి 31న పవన్ ఇంటి వద్దే పెళ్లికి ఏర్పాట్లు చేశారు. వధువు తల్లిదండ్రులు పెళ్లికి రావాలంటే రూ. 10లక్షలు వరకట్నంగా ఇవ్వాలని డిమాండ్ చేయడంతో వారు పెళ్లికి రాలేకపోయారు. పెళ్లి తర్వాత వరకట్నం కోసం భర్తతో పాటు అత్త, మామ, ఇతర కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడిందని.. మృతురాలి తల్లి సూర్యపాక రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

పీయూ సిబ్బంది వేతనాల పెంపుపై కమిటీ భేటీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నాలుగేళ్లుగా తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాల పెంపు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గతంలో 2018లో వైస్ చాన్స్‌లర్ రాజారత్నం ప్రతి సంవత్సరం 12 శాతం వేతనాలు పెంచేలా ప్రతిపాదనలు చేసి 2021 సంవత్సరం వరకు కొనసాగించారు. ఆ తర్వాత వీసీగా వచ్చిన లక్ష్మీకాంత్ రాథోడ్ వేతనాల పెంపుదలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో నూతనంగా వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ సిబ్బంది వేతనాల పెంపుపై పూర్తిస్థాయిలో దృష్టిసారించారు. అందుకోసం ఒక కమిటీని నియమించగా.. సోమవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో భేటీ అయ్యింది. వేతనాల పెంపు ఎంత మేరకు ఉండాలి.. గతంలో ఎంత మేరకు పెంచారు అనే అంశాలపై చర్చించారు. ఈ కమిటీ త్వరలో నివేదిక సమర్పిస్తే దాని ఆధారంగా ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం అనంతరం సిబ్బంది వేతనాలు పెంచేందుకు చర్యలు చేపడుతారు. కమిటీ భేటీలో పీయూ మాజీ రిజిస్ట్రార్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, ప్రొఫెసర్ అప్పారావు, పీయూ అధ్యాపకులు కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పీయూ ముఖద్వారం

155 మందికి ప్రయోజనం..

యూనివర్సిటీలో తాత్కాలిక పద్ధతిలో 155 మంది నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో అటెండర్, స్వీపర్ స్థాయి వారికి రూ.7 వేలు, ల్యాబ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లకు రూ.9 వేల చొప్పున వేతనాలు ఉన్నాయి. రెగ్యులర్ సిబ్బందికి రూ.50 వేలకుపైగా వేతనాలు ఉండగా.. తాత్కాలిక సిబ్బందికి అరకొర వేతనాలు అందుతున్నాయి. గత వీసీ హయాంలో వేతనాల పెంపుకోసం పలు మార్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రతిపాదనలు పెట్టినా పెంపు మాత్రం జరగలేదు. దీంతో చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించలేని పరిస్థితుల్లో పలువురు ఉద్యోగాలు మాని వెళ్లిపోగా.. పలువురు రిటైర్డ్ కూడా అయ్యారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సిబ్బందికి త్వరగా వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని నాన్‌టీచింగ్ సిబ్బంది కోరుతున్నారు.

గడ్డివాములు దగ్ధం



అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామంలోని కురువ బాలప్ప, వడ్డెర తిమ్మప్పలకు సంబంధించిన గడ్డివాముల నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లభించలేదు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైరింజన్లు మంటలు అదుపులోకి తెచ్చాయి. సుమారు రూ. 2 లక్షల నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి బాధితులకు రూ. 10వేలు ఆర్థిక సహాయం చేశారు.

ఏడేళ్ల బాలికపై అత్యాచారం

మన్ననూర్: పదర మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సద్దాం ఉసేన్ తెలిపిన వివరాలిలా.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను సమీప బంధువుల ఇంటి వద్ద ఉంచి తల్లిదండ్రులు వ్యక్తిగత అవసరాల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లారు. ఈక్రమంలో గత 14వ తేదీన బాలికపై ఓ అగంతకుడు అత్యాచారం చేసిన విషయాన్ని బాలిక ద్వారా తల్లిదండ్రులు తెలుసుకున్నారు. ఈ మేరకు వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఊరూరా శ్రీరామోత్సవాలు నిర్వహించాలి


మాట్లాడుతున్న సుధాంశు మోహన్ పట్నాయక్

జడ్చర్ల: ఉగాది పర్వదినం మొదలుకొని హనుమాన్ జయంతి వరకు శ్రీరామ మహోత్సవాలను ఊరూరా అట్టహాసంగా నిర్వహించాలని వీహెచ్‌పీ కేంద్రీయ కార్యదర్శి సుధాంశు మోహన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం జడ్చర్ల మాధవీయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆరు జిల్లాలకు చెందిన వీహెచ్‌పీ ముఖ్యకార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వీహెచ్‌పీ కార్యకర్త కనీసంగా ఐదు గ్రామాలను ఎంపిక చేసుకుని ఉగాది నుంచి హనుమాన్ జయంతి వరకు శ్రీరాముడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు హిందూ సమాజాన్ని జాగృతం చేయాలన్నారు. వీహెచ్‌పీ బలోపేతం కోసం గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇక ప్రతి దేవాలయాన్ని కేంద్రంగా చేసుకుని సత్సంగాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి కార్యకర్త రెండు సత్సంగాలు నిర్వహించే విధంగా చూడాలన్నారు. వీహెచ్‌పీతో పాటు భజరంగ్‌దళ్, మాతృశక్తి, దుర్గావాహిని కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వీరికి వచ్చే రెండు నెలల్లో ప్రత్యేకంగా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. యువత భజరంగ్‌దళ్ శిక్షణ పొందే విధంగా, మిగతా వీహెచ్‌పీ కార్యకర్తలు శిక్షావర్గ పూర్తిచేసే విధంగా కృషి చేయాలన్నారు. అదే విధంగా యువతి విభాగానికి సంబంధించి దుర్గావాహిణి ఆధ్వర్యంలో శిక్షావర్గలో పాల్గొనే విధంగా చూడాలని తెలిపారు. ఆత్మరక్షణ కోసం నేర్పించే విద్యలతో యువతులు సమాజంలోని సమస్యలను అధిగమించాలని కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ ప్రాంత అధ్యక్షుడు నర్సింహామూర్తి, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, విభాగ్ కార్యదర్శి నరేందర్, సహకార్యదర్శులు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, పట్టణ అధ్యక్షుడు అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్ప్రింక్లర్లతో ఉల్లి సాగు చేద్దాం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల


మైక్రో స్ప్రింక్లర్లతో సాగు చేసిన ఉల్లి పంట

అలంపూర్: మైక్రో స్ప్రింక్లర్లతో ఉల్లి పంట సాగు చేయడంతో ఆశించిన దిగుబడి సాధించొచ్చని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సక్రియానాయక్ రైతులకు సూచించారు. జిల్లాలో నీటి సౌకర్యం ఉన్న రైతులు యాసంగిలో ఉల్లిని సాగు చేయడం లాభదాయకమన్నారు. పంట సాగు చేసిన రైతులు మైక్రో స్ప్రింక్లర్లను వాడడం ద్వారా నీటి ఆదా అవుతుందని తెలిపారు. దీనితో పాటు వ్యవసాయ అధికారుల సూచనలతో ఎరువులు సరైన మోతాదులో వాడితే పంట నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.

నాటులో జాగ్రత్తలు

ఒక ఎకరానికి 1.4 లక్షల మొక్కల సాంద్రత ఉండేట్లుగా నాటుకోవాలి. వరుసకు వరస 10 సెంటీమీటర్లు ఉండాలన్నారు. నారు నాటే సమయంలో వాటిని కార్బండిజమ్ 1 గ్రామును లీటర్ నీటికి, మోనోక్రోటోపాస్ 2 మి.లీ నీటితో కలిపిన ద్రావణంలో వేర్లను ముంచి నాటితే మొక్క పెరుగుదల బాగుందని వివరించారు.

మైక్రో స్ప్రింక్లర్లు అమర్చే విధానం

16 మిల్లీ మీటర్ల లేటరల్స్‌ను ప్రధాన పీవీసీ పైపునకు ప్రతి నాలుగు మీటర్ల దూరంలో అమర్చాలి. ప్రతి లేటరల్ పైపు మీద 4 మీటర్ల దూరంలో 8 మి.లీ మీటర్ల ప్లాస్టిక్ పైప్ ద్వారా ఒక మైక్రో స్ప్రింక్లర్లను అమర్చాలి. దీనిని 3 అడుగుల ఎత్తులో అమర్చుకోవాలని సూచించారు. ప్రతి మైక్రో స్ప్రింక్లర్లు గంటకు 148 లీటర్ల నీటిని విడుదల చేస్తోంది.

తెగుళ్ల

నేలలో ఎల్లప్పుడు తగినంత తేమ ఉండటం వలన ఉల్లి గడ్డలు సమాన పరిమాణంలో పెద్దగా పెరుగుతాయి. పంటకాలం 15 నుంచి 17 రోజులు తగ్గుతుంది. నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. నీటి తుంపర్ల వలన శిలింద్రపు తెగుళ్ల ఆశించవు. రసం పీల్చే పురుగులు తుంపర్లకు కొట్టుకొని పోతాయి. మొక్కల సంఖ్య పెరగడం వలన 30 నుంచి 40 శాతం అధిక దిగుబడి వస్తోంది.

కలుపు నివారణ

2 నుంచి 3 సార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. నారు నాటిన మూడు రోజుల తర్వాత పెండిమిథాలిన్ అనే లీటర్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. 40 నుంచి 45 రోజులకు ఒకసారి కలుపుతీయాలి.

నీటి యాజమాన్యం

పొలంలో నీటి నిల్వ ఉంచరాదు. నీరు నిలువ ఉంటే గడ్డ నాణ్యత తగ్గిపోతుంది. ఉల్లి వేరు 10-15 సెం.మీ వరకే ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నంత వరకే నీటిని పెట్టాలి.

సస్యరక్షణ

తామర పురుగుల నివారణకు పిప్రోనిల్ 2 మి.లీ లేదా మిథైల్ డెమటాన్ 2మి.లీలు ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. ఆకుమాడు తెగులు నివారణకు సాఫ్ ఒక గ్రాము ఒక లీటర్ నీటికి లేదా కిటాజెన్ ఒక మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఎరువులు

ఉల్లి నాటిన 30 రోజులకు, 60 రోజులకు యూరియా లేదా సీఏఎస్ వేసుకోవాలి. ఎకరానికి 10-15 కిలోల సల్ఫర్ వాడాలి. దీనివలన నాణ్యమైన గడ్డలు వస్తాయి. 50 కిలోల భాస్వరం 60 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు నాటే ముందు వేసుకోవాలి.